

నేడు అవగాహన సదస్సు

ఆర్‌ఓఎఫ్‌ఆర్, ఎల్టీఆర్ చట్టాలపై ఐటీడీఏ ప్రాంగణంలో శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు పీఓ తెలిపారు. 8లో



అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రత అధికంగానే ఉంటుంది. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నం మరింతగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్వర్ణ కవచాలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు శుక్రవారం స్వర్ణ కవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. అలాగే లక్ష్మీతాయారు అమ్మవారికి పలు రకాల పుష్పాలతో అర్చకులు పుష్పాంజలి నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి(కనకదుర్గ) అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం చేశారు. మొదట అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, పంచ హారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పంతో పాటు గణపతి హోమం, కుంకుమపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులతో పాటు ఈఓ ఎన్.రజనీకుమారి, కమిటీ సభ్యులు గంధం వెంగళరావు పాల్గొన్నారు.

దసరాకు 695 ప్రత్యేక బస్సులు



ఖమ్మం మామిళ్లగూడెం: దసరా పండుగ సందర్భంగా స్వస్థలాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఈనెల 13నుండి 24వ తేదీ వరకు ఖమ్మం రీజియన్‌లో 695 ప్రత్యేక బస్సులు నడపాలని అధికారులు నిర్ణయించారు. గత ఏడాది 655 బస్సులు మాత్రమే నడపగా ఈసారి పెంచడమేకాక రద్దీకి అనుగుణంగా మరిన్ని సర్వీసులు నడిపిస్తామని అధికారులు తెలిపారు. కాగా, ఈనెల 13వ తేదీన 45బస్సులు, 14న 35బస్సులు, 15న 35, 16న 50, 17న 60, 18న 60, 19న 60, 20న 75, 21న 75, 22న 75, 23న 75, 24వ తేదీన 50 బస్సులు నడిపేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై రీజియన్‌లోని ఆరు డిపోల అధికారులతో సమావేశాలు నిర్వహించిన రీజియన్ అధికారులు ప్రత్యేక సర్వీసులపై సూచనలు చేశారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలకు

డీఐఈఓ సులోచనా రాణి



లైబ్రరీని పరిశీలిస్తున్న సులోచనా రాణి

దుమ్ముగూడెం : విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరై బాగా చదువుకుంటేనే ఉన్నత శిఖరాలు అధిరోహించే అవకాశం ఉంటుందని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాశాఖాధికారి(డీఐఈఓ) సులోచనా రాణి అన్నారు. దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, చదివిన కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. స్థానిక కళాశాలలో గతంలో కంటే ఈ ఏడాది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గోవులకు గోస..



వాహనంలో కిక్కిరిసి తీసుకొస్తున్న ఆవులు



కిక్కిరిసి తీసుకొస్తుండగా తొక్కిసలాటతో చనిపోయిన ఆవు



వాహనంలో తొక్కిసలాటలతో తీవ్రంగా గాయపడిన ఆవు

అక్రమంగా కబేళాలకు తరలుతున్న పశువులు

- వాహనాల్లో పరిమితికి మించి రవాణా
- డీసీఎంలు, లారీల్లో కుక్కడంతో గోవులకు తీవ్ర గాయాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కాసుల కక్కుర్తితో కళ్లు మూసుకుపోయిన కొందరు అక్రమార్కులు బతికుండానే గోవులకు నరకం చూపిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో స్వేచ్ఛగా తిరిగే పశువులను చెరబట్టి వాహనాల్లో కుక్కి జిల్లా మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో పశువుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలు కొందరికి చుట్టంగా మారడంతో ఆవుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

ఛత్తీస్‌గఢ్ టు హైదరాబాద్

ఆధునీకరణ ప్రభావం ఛత్తీస్‌గఢ్ పల్లెలపై కూడా పడింది. ఇప్పుడిప్పుడే కొందరు ఆవుల నుంచి పాలు సేకరిస్తుండగా, మరికొందరు వ్యవసాయంలోనూ ఉపయోగిస్తున్నారు. ఆర్థిక అవసరాల నిమిత్తం కొందరు తమ పశువులను అమ్ముకుంటున్నారు కూడా. దీన్ని ఆసరాగా తీసుకున్న కొన్ని ముఠాలు భద్రాద్రి జిల్లా కేంద్రంగా పశువుల అక్రమ రవాణాకు తెరలేపాయి. హైదరాబాద్ శివార్లలో ఉన్న బీఫ్ ఎక్స్‌పోర్ట్ కంపెనీలకు అక్రమంగా పశువులను భారీ ఎత్తున రవాణా చేస్తున్నారు.

నిబంధనలు ఇలా..

నిబంధనల ప్రకారం 14 ఏళ్ల వయసు నిండిన పశువులనే కబేళాలకు తరలించాలి. ఆ పశువు ఇటు బ్రీడ్ డెవలప్‌మెంట్‌కు, అటు వ్యవసాయానికి పనికి రాదని వెటర్నరీ డాక్టర్ సర్టిఫికెట్ ఇవ్వాలి. అప్పుడు కూడా ప్రభుత్వ అనుమతి తీసుకున్న కబేళాలోనే వాటిని వధించాలి. జంతుహింస 1960 చట్టం ప్రకారం.. ఒక లారీలో ఆరు పశువులను మించి రవాణా చేయకూడదు. రవాణా సమయంలో పశువుల సంరక్షణకు ఒక వ్యక్తిని నియమించాలి. మార్గమధ్యంలో వాటికి అవసరమైన ఆహారం, నీళ్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలి. రవాణా సమయంలో పశువులు చనిపోతే అందుకు బాధ్యులైన వ్యక్తులకు ఐపీసీ 429 ప్రకారం రెండు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

కానీ జరుగుతున్నది ఇలా..

14 ఏళ్లు నిండిన జంతువులనే కబేళాలకు తరలించాలనే నిబంధనలు ఉన్నా.. అక్రమార్కులు వాటిని తుంగలో తొక్కుతున్నారు. రవాణా అవుతున్న ఆవుల్లో నూటికి తొంభై శాతం పదేళ్లలోపువే ఉంటున్నాయి. కొన్ని సార్లయితే దూడలను సైతం కబేళాలకు తరలిస్తున్నారు. ఒక డీసీఎం/లారీలో ఆరు పశువులను మాత్రమే తరలించాల్సి ఉండగా.. ఆయా వాహనాల్లో ఒకదానిపై మరొకటిగా చెక్కలతో అరలుగా ఏర్పాటు చేసి 20 నుంచి 60 వరకు కుక్కి మరీ తరలిస్తున్నారు. ఒత్తిడికి తట్టుకోలేక పశువులు మార్గమధ్యంలోనే తీవ్రంగా గాయపడుతున్నాయి. మరికొన్ని చనిపోతున్నాయి.

పట్టుబడితే వెలుగులోకి..

చాన్నాళ్లుగా ఈ వ్యవహారం గుట్టు చప్పుడు కాకుండా సాగుతోంది. ఇటీవల నిఘా పెరగడంతో జిల్లా వ్యాప్తంగా వారంలో ఒకసారైనా పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనం పట్టుబడుతోంది. తద్వారా ఈ మొత్తం వ్యవహారం వెలుగు చూస్తోంది. పట్టుబడిన వాహనంలోకి ఒకసారి తొంగి చూస్తే ఎంతటి కఠినాత్ములకైనా కన్నీరు రాక మానదు అనేంత దీన స్థితిలో గోవులు ఉంటున్నాయి.

పశువులంటే ఆదివాసీలకు ప్రాణం..

ఛత్తీస్‌గఢ్‌లో అటవీ ప్రాంతం ఎక్కువ. అక్కడి ఆదివాసీలు తమ జీవన విధానంలో భాగంగా పశువులను భారీగా పెంచుకుంటారు. విస్తారమైన అడవుల్లో మేస్తూ పశువులు అక్కడ స్వేచ్ఛగా జీవిస్తాయి. 15 ఏళ్ల క్రితం వరకు అక్కడి ప్రజలు కనీసం పశువుల నుంచి పాలు కూడా తీసేవారు కాదు. పాలు లేకుండా డికాషన్ టీ తాగడమే వారికి అలవాటు. చివరకు వ్యవసాయంలోనూ పశువులను ఉపయోగించేవారు కాదు. అందువల్లే ఛత్తీస్‌గఢ్‌లో గేదెల కంటే ఆవులే ఎక్కువగా కనిపిస్తాయి. ఆఖరికి తెలుగు రాష్ట్రాలకు వలస వచ్చిన ఆదివాసీలు సైతం పశువుల కారణంగా స్థానికులకు ఇబ్బంది రాకూడదని రోడ్డు, నీళ్లు, కరెంటు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేకున్నా అడవుల్లోనే నివాసం ఉంటారు. ఇప్పుడిప్పుడే ఈ పరిస్థితుల్లో మార్పులు వస్తున్నాయి.

‘గుర్తింపు’ ఎన్నికలకు నామినేషన్లు

- మొదటి రోజు నామినేషన్ దాఖలు చేసిన 10 కార్మిక సంఘాలు
- నేటితో ముగియనున్న గడువు. ఈ నెల 28న సింగరేణిలో ఎన్నికలు



ఆర్‌ఎల్‌సీ అజయ్‌కుమార్ సాహుకు నామినేషన్ దాఖలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు శుక్రవారం 10 ట్రేడ్ యూనియన్లు నామినేషన్ దాఖలు చేశాయి. ఈ నెల 28న గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు గత నెల 27న ఎన్నికల అధికారి, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ దేవరకొండ శ్రీనివాస్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విదితమే. సింగరేణిలో మొత్తం 14 కార్మిక సంఘాలు ఉండగా, తొలిరోజు 10 కార్మిక సంఘాలు నామినేషన్లు వేశాయి. మిగతా నాలుగు సంఘాలు టీబీజీకేఎస్, ఇఫ్టూ, ఈపీ ఆపరేటర్లు, సింగరేణి గని కార్మిక సంఘం నామినేషన్లు వేయలేదు. కాగా శనివారంతో నామినేషన్ గడువు ముగియనుంది. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) తరపున అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య నామినేషన్ పత్రాలను హైదరాబాద్ డీవైసీఎల్సీ కార్యాలయంలో ఆర్‌ఎల్‌సీ అజయ్‌కుమార్ సాహుకు శుక్రవారం అందజేశారు. సింగరేణికోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావుతోపాటు మరో ఆరు కార్మిక సంఘాల నాయకులు ఆయా యూనియన్ల తరపున నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఏఐటీయూసీ నాయకుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ కాలపరిమితి ముగిసినా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించకపోవడంతో న్యాయ పోరాటం చేశామని తెలిపారు. హైకోర్టులో కేసు వేయగా, మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని గత ఫిబ్రవరిలో న్యాయస్థానం తీర్పు ఇచ్చిందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం గుర్తింపు సంఘం ఎన్నికలు జరపకుండా వాయిదా వేస్తూ వచ్చాయని ఆరోపించారు.

మూడు రోజులు సదరమ్ క్యాంపులు

చుంచుపల్లి: జిల్లాలోని దివ్యాంగుల కోసం ఈనెల 11, 18, 27 తేదీల్లో సదరమ్ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు డీఆర్డీఏ కార్యాలయ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులను కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నిర్వహించనున్నామని, ఇందుకోసం స్లాట్ బుకింగ్ సౌకర్యం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత ఆధారాలతో నేరుగా హాజరు కావాలని సూచించారు.

నిర్వాసితులుగా గుర్తించకుంటే కానుకలూ వద్దు

బతుకమ్మ చీరలను తిరస్కరించిన తిలక్‌నగర్ మహిళలు



రేషన్ షాపు వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

ఇల్లెందురూరల్: జేకే ఓసీ ప్రభావిత ప్రాంతంలో ఉన్న తమను నిర్వాసితులుగా గుర్తించాలని కోరుతూ నిత్యం ఆందోళన చేస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని, అలాంటప్పుడు ప్రభుత్వం అందించే బతుకమ్మ చీరలు మాత్రం తమకెందుకని మండలంలోని తిలక్‌నగర్‌కు చెందిన మహిళలు అన్నారు. పంచాయతీ పరిధిలోని కుమ్మరి బస్తీ రేషన్‌షాపు వద్దకు శుక్రవారం చేరుకున్న మహిళలు చీరలు తీసుకోకుండా నిరసన వ్యక్తం చేశారు. అధికారులు, నాయకుల వైఖరికి నిరసనగా ఇప్పటికే ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించామని, ఇప్పుడు చీరలు కూడా తిరస్కరిస్తున్నామని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాల్వంచరూరల్: పాల్వంచ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ల్యాబ్ అసిస్టెంట్, కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల విద్యాలయాల ఖమ్మం రీజియన్ (ఆర్సీఓ) సమన్వయ అధికారి కె.ప్రత్యూష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాబ్ అసిస్టెంట్ 2, కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్ 1 పోస్టు ఉన్నాయని పేర్కొన్నారు. ల్యాబ్ అసిస్టెంట్‌ల్లో ఒక పోస్టు ఎస్సీ మహిళలకు, మరో పోస్టు జనరల్ మహిళలకు, కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్ పోస్ట్ జనరల్ మహిళలకు కేటాయించామని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, మైక్రో బయాలజీ కోర్సుల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన వారు ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయం, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఖమ్మం రీజియన్, కొత్త కలెక్టరేట్, వెంకటాయపాలెం చిరునామాకు పంపించాలని తెలిపారు.

పోషకాల పెంపునకే అల్పాహారం



విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న కలెక్టర్ ప్రియాంక అల, ఎమ్మెల్యే వనమా తదితరులు

- కలెక్టర్ ప్రియాంక ఆల వెల్లడి
- జిల్లాలో 498 మంది విద్యార్థులకు అందజేత

కొత్తగూడెంరూరల్ : విద్యార్థులకు పోషక విలువలతో కూడిన అహారం అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం అల్పాహార కార్యక్రమం ప్రవేశ పెట్టిందని కలెక్టర్ ప్రియాంక అల అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో సీఎం అల్పాహార పథకాన్ని స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతో కలిసి శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతానికి ఒక్కో నియోజకవర్గంలో ఒక పాఠశాల చొప్పున ఎంపిక చేసి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. అశ్వారావుపేట బీసీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 55 మంది విద్యార్థులకు, భద్రాచలం తాతగుడి సెంటర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 159, కొత్తగూడెం నియోజకవర్గంలో లక్ష్మీదేవిపల్లి మండలం ఇందిరానగర్ పాఠశాలలో 115, పినపాకలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 124, ఇల్లెందు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 45.. మొత్తంగా జిల్లాలో 498 మంది విద్యార్థులకు అల్పాహారం అందజేసినట్లు వివరించారు. దసరా సెలవుల అనంతరం జిల్లాలోని 1,387 పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తామని, తద్వారా 96,897 మంది విద్యార్థులకు అల్పాహారం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటాచారి, జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత, అల్పాహార పథకం ప్రత్యేకాధికారి స్వర్ణలత లెనినా, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, ఎంపీపీ భూక్యా సోనా, ఎంపీటీసీ కొల్లు పద్మ, సర్పంచ్ పూనెం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ లగడపాటి రమేష్ పాల్గొన్నారు.

మహిళలకు అండగా ‘సఖి’

కొత్తగూడెంటౌన్: హింసకు గురవుతున్న మహిళలకు కొండంత అండగా సఖీ కేంద్రాలు పని చేస్తాయని కలెక్టర్ ప్రియాంక ఆల, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణపరిధి 35 వార్డులో రూ.48.69 లక్షల వ్యయంతో నిర్మించిన సఖి (వన్‌స్టాప్ సెంటర్) భవనాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. హింసకు గురయ్యే మహిళలు సఖీ కేంద్రాన్ని ఆశ్రయిస్తే తగు చర్యలు తీసుకుంటారని చెప్పారు. అవసరమైన న్యాయ సహాయం, సలహాలు అందిస్తారని, ఆశ్రయం కల్పించడంతో పాటు ఇతరులపై ఆధారపడకుండా స్వధార్ కేంద్రం సహకారంతో శిక్షణ కూడా ఇస్తారని వివరించారు. ఆపదలో ఉన్న మహిళలు 08744-248222, 8688005934 నంబర్లకు ఫోన్ చేసి సాయం పొందవచ్చని తెలిపారు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు, భర్త, కుటుంబ సభ్యుల వేధింపులకు గురవుతున్న వారికి సఖీ కేంద్రాలు అండగా నిలుస్తాయన్నారు. కౌన్సిలింగ్ చేసి భార్యాభర్తల మధ్య రాజీ కుదురుస్తారని, అలాంటి దంపతులను ఆరు నెలల వరకు కేంద్రం సభ్యులు పర్యవేక్షిస్తుంటారని చెప్పారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి విజేత, మున్సిపల్ కమిషనర్ జి.రఘు, కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి, జాగృతి సంస్థ బాధ్యురాలు కుముదిని, సీడీపీఓ స్వర్ణలత లెనినా, కనకదుర్గ, సఖి కేంద్రం అడ్మిన్ శుభాశ్రీ, లీగల్ కౌన్సిల్ సునిత, సిబ్బంది పసుమతి, వసంత, శారద, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సింగరేణి ప్రధానాస్పత్రిలో లాన్ టెన్నిస్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సుజాత

సింగరేణి(కొత్తగూడెం): క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం సిద్ధిస్తాయని సింగరేణి ప్రధానాస్పత్రి సీఎంఓ సుజాత, ఏజీఎం శ్రీనివాస్, ఏసీఎంఓ విక్టర్ వందనం అన్నారు. కార్పొరేట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో నిర్వహిస్తున్న లాన్ టెన్నిస్ పోటీలను శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తోందని తెలిపారు. చిన్నప్పటి నుంచి క్రీడలను దినచర్యగా పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ పోటీల్లో సీనియర్లతో పాటు యువ క్రీడాకారులు సైతం పాల్గొని ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు. ఏరియా స్థాయిలోనే కాకుండా కంపెనీ, కోలిండియా స్థాయిలో రాణించి సంస్థకు పేరు తేవాలని ఆకాంక్షించారు. ఇక్కడి పోటీల్లో ప్రతిభ చూపిన వారిని ఈనెల 19, 20 తేదీల్లో శ్రీరాంపూర్‌లో జరిగే కంపెనీ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. అనంతరం ప్రకాశం స్టేడియంలో మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి శ్రీనివాస్, సీనియర్ పీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దిగుబడిపై దిగులు

- ఇటీవలి వర్షాలతో పత్తికి నష్టం
- నేల రాలుతున్న పూత, పిందె
- వానలకు నల్లబడిన కాయలు
- పెరుగుతున్న పెట్టుబడులతో రైతుల్లో ఆందోళన



పత్తి సస్యరక్షణకు మందులు కొడుతున్న రైతు

బూర్గంపాడు: గత నెలలో కురిసిన వర్షాలు పత్తి పంటకు ప్రతిబంధకంగా మారాయి. పూత, కాత దశలో ఉన్న పంటను వర్షాలు నష్టపరిచాయి. సెప్టెంబర్‌లో రెండు, మూడు రోజులకు ఒకసారి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు పత్తి దిగుబడిపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజులుగా వర్షాలు ఆగినా పూత, పిందె మాత్రం నేల రాలుతూనే ఉన్నాయి. కాయలు వర్షాలకు నల్లబడి కుళ్లిపోతున్నాయి. ప్రతి ఏటా అక్టోబర్‌లో తొలివిడత పత్తి తీసేవారు. వర్షాల కారణంగా ఈ ఏడాది ఈ ప్రక్రియ ఆలస్యమయ్యేలా ఉంది. వర్షాలతో పత్తి మొక్కలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. మొక్కలకు పారావిల్ట్, సడెన్ విల్ట్ తెగుళ్లు సోకి చనిపోతున్నాయి. ఇది కూడా పత్తి దిగుబడిపై ప్రభావం చూపనుంది.

1.95 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలో ఈ ఏడాది 1.95 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగైంది. గతేడాది కంటే ఇది సుమారు 20 వేల ఎకరాలు అదనం. ఈ సంవత్సరం సుమారు 18 లక్షల క్వింటాళ్ల పంట దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. గింజలు వేసినప్పుడు వాతావరణం పత్తిసాగుకు అనుకూలంగా ఉంది. అయితే జూలైలో వచ్చిన గోదావరి వరదలు, అధిక వర్షాలు పంటకు నష్టం కలిగించాయి. ముంపునకు గురైన పత్తి పూర్తిగా దెబ్బతింది. మిగిలిన చోట్ల అధిక వర్షాలకు చేలలో నీరు నిలిచి మొక్కలు పెద్దగా ఎదగలేదు. ఆగస్టులో కూడా ఎడతెరిపి లేకుండా కురిసిన వానలు ఈ పంటకు ప్రతికూలంగా మారాయి. కనీసం సెప్టెంబర్‌లోనైనా వర్షాలు ఒకింత తగ్గుతాయనుకుంటే ఈ నెలలోనూ అదే పరిస్థితి. దీంతో పూత, కాత దశలో ఉన్న పత్తిచేలు దెబ్బతింటున్నాయి. ఏపుగా పెరిగిన చేలలో రోజూ కురుస్తున్న వర్షాలకు పత్తికాయలు కుళ్లిపోతున్నాయి. దీంతో ఎకరాకు సుమారు 2 క్వింటాళ్ల మేర దిగుబడి తగ్గవచ్చని రైతులు అంటున్నారు. ఇక పంటకు దోమ, తెగుళ్లు ఆశిస్తుండడంతో వారానికి ఒకసారి పురుగుమందులు పిచికారీ చేస్తున్నామని, పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయని చెబుతున్నారు.

బీటీ పవర్ తగ్గింది..

రైతులు పత్తి గింజలు వేసి ఇప్పటికే మూడున్నర నెలలు దాటింది. వర్షాల కారణంగా పత్తి కాత ఆలస్యమైంది. ఇక మొక్కలలో బీటీ పవర్ కూడా తగ్గిపోయిందని రైతులు అంటున్నారు. ఇప్పటి నుంచి పత్తికి ఇంకా చీడపీడలు, పురుగు, దోమ ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు మందులు పిచికారీ చేయాలి. పంట రావడం ఆలస్యం అవుతుండటంతో పెట్టుబడి ఖర్చులు కూడా పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు.

వర్షాలకు పత్తి చేలు దెబ్బతింటున్నాయి



ఈ ఏడాది నాలుగు నెలలుగా కురుస్తున్న వర్షాలకు పత్తి చేలు దెబ్బతిన్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పూత, పిందె రాలిపోతున్నాయి. పత్తికాయలు కుళ్లిపోతున్నాయి. ఎకరానికి తక్కువలో తక్కువ రెండు క్వింటాళ్ల దిగుబడి వచ్చే కాయలు కుళ్లిపోయే ప్రమాదం నెలకొంది.

– నన్నూరి వీరారెడ్డి, రైతు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వర్షాలకు పత్తిలో పూత, పిందె రాలిపోతే చేలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. పారావిల్ట్, సడన్ విల్ట్‌తో మొక్కలు చనిపోతుంటే రసాయనిక మందులు పిచికారీ చేయాలి. వాన లేనప్పుడు యూరియా, 19:19:19, ప్లానో ఫిక్స్ వంటి మందులు పిచికారీ చేయాలి. బూజు తెగుళ్ల రాకుండా శిలీంద్రనాశిని మందులు పిచికారీ చేసుకోవాలి.

– బి.తాతారావు, ఏడీఏ

క్లుప్తంగా

నేడు గిరిజన చట్టాలపై అవగాహన సదస్సు



గిరిజనభవన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: ఆర్‌ఓఎఫ్‌ఆర్, ఎల్టీఆర్, పీసా చట్టాలపై భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజనభవన్‌లో శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. గిరిజన చట్టాలపై అనుభవం కలిగిన న్యాయవాది త్రినాథరావు, అధికారులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడుతారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్‌రాజ్, అధికారులు సురేశ్‌బాబు, ఆర్.శ్రీనివాస్, మునీర్‌పాషా, అశోక్‌కుమార్, ప్రభాకర్‌రావు, హరీశ్, నర్సింహారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఐటీడీఏ ప్రాంగణంలోని సిబ్బంది క్వార్టర్ల నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని పీఓ ఆదేశించారు. ఈ మేరకు క్వార్టర్స్‌ను పరిశీలించిన ఆయన అధికారులకు సూచనలు చేశారు.

అదనపు కోర్టు మంజూరు

భద్రాచలంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం భద్రాచలానికి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ స్థాయిల్లో 57 కోర్టులను మంజూరు చేయగా, వాటిలో భద్రాచలానికి కూడా స్థానం దక్కింది. భద్రాచలం పట్టణంలో ప్రస్తుతం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఉంది. కోర్టు మంజూరు పట్ల భద్రాచలం బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం న్యాయమూర్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

గణేష్ టెంపుల్ రెన్నోవేషన్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

కొత్తగూడెంటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం(గణేష్ టెంపుల్) రెన్నోవేషన్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఐదు నెలల కాలానికి గాను 13 మందితో కమిటీని ఎన్నుకున్నట్లు దేవాదాయశాఖ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన తాటిపల్లి శంకర్‌బాబు ప్రమాణ స్వీకారం అనంతరం మాట్లాడుతూ భక్తుల కోసం సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కాగా, కమిటీ అధ్యక్షుడు శంకర్‌బాబు, సభ్యులను కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు బేల్‌సింగ్, ఈఓ కె.సులోచన తదితరులు పాల్గొన్నారు.

బీటీపీఎస్‌కు పటిష్టమైన భద్రత

మణుగూరురూరల్: మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పటిష్టమైన భద్రత కలిస్తున్నట్లు ప్లాంట్ సీఈ బిచ్చన్న తెలిపారు. ఈ మేరకు 9వ తేదీ నుంచి స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది భద్రతా విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కాగా, భద్రతా సిబ్బంది డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో పనిచేస్తారని తెలిపారు. బీటీపీఎస్‌కు భారీ భద్రత ఏర్పాట్లలో భాగంగా విద్యుత్ సౌధ ఈ నిర్ణయం తీసుకుందని సీఈ వెల్లడించారు.

సెంటు భూమి కూడా వదులుకోం

లింగాల గ్రామ పోడు రైతుల ఆగ్రహం



పోడు భూముల్లో నిరసన తెలుపుతున్న గిరిజనులు

చర్ల: చావనైనా చస్తాం గానీ చెట్టు పుట్ట కొట్టి సాగు చేసుకుంటున్న పోడు భూములను మాత్రం వదులుకోబోమని లింగాల గిరిజనులు పేర్కొన్నారు. మండలంలోని కలివేరు గ్రామపంచాయతీ లింగాలకు చెందిన గిరిజనులు బట్టీగూడెం సమీపంలోని అటవీ ప్రాంతంలో 1980 నుంచి పోడు సాగు చేసుకుంటున్నారు. కాగా అటవీశాఖలోని కొందరు సాగులో లేని వారికి పట్టాలు చేయించారని ఆరోపిస్తూ లింగాల గిరిజనులు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పోడు భూములలో అటవీశాఖాధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. తాము సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖాధికారులు స్వాధీనం చేసుకుని, వేరేవారికి కట్టబెట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శి ముసలి సతీష్, లింగాల, బట్టీగూడెం గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

కారుకు పోలీస్ స్టిక్కర్‌తో..

- గంజాయి తరలిస్తున్న స్మగ్లర్లు
- భద్రాచలంలో 95 కిలోలు స్వాధీనం





నిందితులను చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు, (ఇన్‌సెట్) పోలీస్ స్టిక్కర్ ఉన్న నంబర్ ప్లేట్..

భద్రాచలంటౌన్: ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల నుంచి భద్రాచలం మీదుగా స్మగ్లర్లు భారీగా గంజాయి తరలిస్తున్నారు. ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు తనిఖీలు చేపడుతున్నా.. వాళ్ల కళ్లు గప్పి జిల్లా మీదుగా ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. తాజాగా పోలీస్ స్టిక్కర్ వేసిన కారులో గంజాయి తరలిస్తూ భద్రాచలంలో పట్టుబడ్డారు. ఎక్సైజ్ ఏఈఎస్‌లు తిరుపతి, కరంచంద్ కథనం ప్రకారం.. పట్టణంలో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ డీ టీమ్ ధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పోలీస్ స్టిక్కర్‌తో ఉన్న ఓ కారు వస్తుండగా, వాహనంలో ఉన్న వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద ఆపి తనిఖీ చేయగా, 85 కిలోల గంజాయి లభించింది. గంజాయి అక్రమంగా తరలిస్తున్న నిర్మల్ జిల్లాకు చెందిన అద్నన్, ఎస్‌కే అబ్బులు, ముంబైకి చెందిన షఫీవుల్లా ముస్తక్ అహ్మద్ ఖాన్, ఎస్కె ఆఫతక్ ముస్తక్‌లను అరెస్ట్ చేశారు. వీరు ఒడిశా నుంచి గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో తేలింది.

మరో ఘటనలో..

ఒడిశాలోని మల్కనగిరి నుంచి ద్విచక్రవానంపై గంజాయి తరలిస్తున్న పెద్దపల్లికి చెందిన తీగల శశి, దేవి రవితేజలను శుక్రవారం ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 9.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండు ఘటనల్లో మొత్తం 95 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, ఐదు సెల్‌ఫోన్లు, రెండు వాహనాలు సీజ్ చేశామని అధికారులు తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు రూ.26.30 లక్షలు ఉంటుందని, నిందితులను రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. సమావేశంలో సీఐలు ఎస్‌కే లతీఫ్, వై.సర్వేశ్వర్, నాగేశ్వరరావు, రహీమున్నిసా, ఎస్‌ఐలు అనిల్, మురళి, గౌతమ్, మురళీకృష్ణ, రతన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ వద్ద 20 కేజీలు..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద పోలీసులు 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఏఎస్పీ పరితోష్ పంకజ్ కథనం ప్రకారం.. ఒడిశాలోని మల్కనగిరి ప్రాంతం నుంచి కొనుగోలు చేసి తమిళనాడులో విక్రయించేందుకు బ్యాగుల్లో తీసుకెళ్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు పట్టుకున్నారు. తమిళనాడుకు చెందిన మురుగన్ అనే వ్యక్తి ఆదేశాలతో మల్కన్‌గిరికి చెందిన అఖిల్ అనే వ్యక్తి వద్ద తమిళనాడుకు చెందిన జగదీష్, పచియపన్ విష్ణు, వినోత్ కుమార్‌లు గంజాయి కొని తీసుకెళ్తున్నట్లు విచారణలో తేలింది. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.4 లక్షలు ఉంటుందని అంచనా. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేశారు. తనిఖీల్లో సీఐ నాగరాజు, ఎస్ఐ పీవీఎన్‌రావు పాల్గొన్నారు.

రంగాపురంలో రూ.22 లక్షల విలువైన..



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పాల్వంచరూరల్: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు స్మగ్లర్లను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఏఎస్ఐ సుధాకర్ కథనం ప్రకారం .. విశ్వసనీయ సమాచారం మేరకు మండల పరిధిలోని రంగాపురం వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఎస్ఐ నాగభిక్షం శుక్రవారం నిఘా పెట్టారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా చింతూరు నుంచి కామారెడ్డికి వెళ్తున్న డోజర్ ట్రాక్టర్ పైకప్పులో రూ.22.23 లక్షల విలువైన గంజాయి ప్యాకెట్లు తరలిస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. గంజాయిని తరలిస్తున్న కామారెడ్డికి చెందిన కుంచం ఎల్లయ్య, సిరిసిల్ల జిల్లా వీరపల్లి గ్రామానికి చెందిన దేవుళ్ల ఎల్లయ్య, ట్రాక్టర్ డ్రైవర్, జగిత్యాల జిల్లా కోడిమెల గ్రామానికి చెందిన సూరారెడ్డిలను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అన్ని రంగాల్లో అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ రేగా కాంతారావు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రేగా

మణుగూరు రూరల్: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాక అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు. మణుగూరు మున్సిపాలిటీ, మండల పరిధిలో సుమారు రూ.57కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం, తోగ్గూడెంలో రూ.కోటితో నిర్మించే మున్నూరుకాపు సంఘం భవనం, రూ.కోటితో నిర్మించనున్న రెడ్డి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి విప్ శంకుస్థాపన చేశారు. అలాగే, శివలింగాపురంలో రూ.50లక్షలతో నిర్మించిన బృహత్ పట్టణ ప్రకృతి వనం, రూ.కోటితో నిర్మించిన వైకుంఠధామాన్ని ప్రారంభించాక కాంతారావు మాట్లాడారు. తెలంగాణ ఏర్పడి కేసీఆర్ అధికారం చేపట్టాక అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీలు పోశం నరసింహరావు, కామిరెడ్డి శ్రీలత, ఎంపీపీలు కారం విజయకుమారి, గుమ్మడి గాంధీ, సొసైటీ చెర్మన్ కుర్రి నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎంపిడిఓ చంద్రమౌళి, సీఐ రమాకాంత్, బీఆర్ఎస్ నాయకులు ముత్యం బాబు, అడపా అప్పారావు, యాదగిరిగౌడ్, ఎడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ ప్రియాంక, ఎమ్మెల్యే వనమా



సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వనమా, కలెక్టర్ ప్రియాంక అల

పాల్వంచ: పట్టణంలోని కేఎస్పీ రోడ్డులో అంబేద్కర్ సెంటర్ నుంచి అల్లూరి సెంటర్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను శుక్రవారం కలెక్టర్ ప్రియాంక అల, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఏడాది కాలంగా పట్టణవాసులు ఎదురుచూస్తుండగా, ఎట్టకేలకు సెంట్రల్ లైటింగ్ అందుబాటులోకి వచ్చింది. మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ, ఇతర శాఖ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హడావుడిగా ప్రారంభం..

రూ.5 కోట్ల వ్యయంతో కేఎస్పీ రోడ్డులో 2022 ఆగస్టులో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, ఎలక్ట్రికల్ టవర్ల ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ పనులు సంవత్సర కాలంగా నత్తనడకన సాగడంతో ప్రజలు చీకట్లో మగ్గాల్సి వచ్చింది. ఎన్నికల కోడ్ నేడో, రేపో వస్తుందనే హడావుడితో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. రూ.8 లక్షల వ్యయంతో చేయాల్సిన డివైడర్లకు పెయింటింగ్ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

గర్భిణులకు ప్రయాణపాట్లు



మాతా శిశు సంరక్షణ కేంద్రం

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి వెళ్లాలంటే గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా గర్భిణులు, పిల్లల తల్లులు వైద్య సేవల కోసం ఇక్కడికి వస్తుంటారు. బాలింతలు, గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వంద పడకలతో మాతా శిశు సంరక్షణ కేంద్రం నిర్మించింది. నిత్యం ఓపీ కేసులు 100 రావడంతోపాటు నెలకు 300 వరకు కాన్పులు జరుగుతాయి. జిల్లా కేంద్రంలో భాగంగా ఉన్న చుంచుపల్లి మండలంలోని త్రీఇంక్‌లైన్ పంచాయతీలో మాతా శిశు సంరక్షణ కేంద్రం ఉంది. ఈ ఆస్పత్రి ప్రధాన రహదారికి అరకిలోమీటరు దూరంలో ఉంటుంది. ఆస్పత్రి సమీపంలో బస్టాప్ కూడా లేదు. దీంతో గర్భిణులు, మహిళలు చంటి పిల్లలతో రోడ్డుపై ఆటో దిగి సుమారు అర కిలోమీటరు నడిచి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి మాతా శిశు సంరక్షణ కేంద్రం సమీపంలో బస్టాప్ ఏర్పాటు చేయాలని, ప్రధాన రహదారి నుంచి ఆస్పత్రికి ఎలక్ట్రిక్ వాహనాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నేడు, రేపు ఎంపీ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు శని, ఆదివారాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటిస్తారు. జూలూరుపాడు మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో శనివారం పాల్గొననున్న ఆయన కొత్తగూడెం, పాల్వంచ కార్యక్రమాల్లో హాజరవుతారు. ఇక ఆదివారం ఖమ్మం, కొణిజర్ల, మధిర, చింతకాని మండలాల్లో ఎంపీ పర్యటిస్తారని ఆయన క్యాంపు కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో వెల్లడించాయి.

గంజాయి రవాణా కేసులో 12 ఏళ్ల చొప్పున జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో హైదరాబాద్‌కు చెందిన ముగ్గురికి 12 ఏళ్ల చొప్పున కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ కొత్తగూడెం జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి(స్పెషల్ జడ్జి ఎన్‌డీపీఎస్ యాక్ట్) శ్యాంశ్రీ శుక్రవారం తీర్పునిచ్చారు. ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. భద్రాచలం పోలీసులు 2022 జూలై 26న వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో.. ఇన్నోవా కారులో వస్తున్న హైదరాబాద్ పాత హఫీజ్‌పేటకు చెందిన బర్ల శ్రీకాంత్, ఈర్ల అనిరుధ్, తవుట వినయ్‌ను ఆపారు. వీరి వద్ద 200 కేజీల గంజాయి లభించగా, ఒడిశాలో కొనుగోలు చేసి అమ్మేందుకు వెళ్తున్నట్లు విచారణలో అంగీకరించారు. దీంతో భద్రాచలం టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్‌ను దాఖలు చేయగా, విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ముగ్గురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రావి విజయ్‌కుమార్ వాదించగా, ఎం.హరిగోపాల్, గంజి శశిధర్ సహకరించారు.

స్త్రీనిధి' గోల్‌మాల్‌పై మళ్లీ రగడ

- రూ.7.88 లక్షలు మింగేసిన గ్రామదీపిక
- గ్రామదీపిక తొలగింపు, సీసీ సస్పెన్షన్



ఘర్షణ పడుతున్న పొదుపు సంఘాల సభ్యులు

చంద్రుగొండ : మండలంలోని పోకలగూడెం గ్రామంలో జై హనుమాన్ గ్రామ సమాఖ్య స్త్రీనిధి నిధుల్లో జరిగిన గోల్‌మాల్ వ్యవహారంపై మళ్లీ రగడ నెలకొంది. శుక్రవారం సెర్ప్ ఏపీఎం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామసమాఖ్యల మహిళలు సమావేశమయ్యారు. వాడుకున్న రూ. 7.88 లక్షలు చెల్లించాల్సిందిగా గ్రామదీపిక సునీతను సభ్యులు నిలదీశారు. తాను సీసీ సాయమ్మకు కొంత డబ్బు ఇచ్చానని, అయినా నా పరిస్థితి బాగలేదని, ఇప్పుడు అంతమొత్తం డబ్బు చెల్లించలేనని గ్రామదీపిక చెప్పడంతో పొదుపు సంఘాల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామదీపికతోపాటు సీసీపై చేయి చేసుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. కాగా జైహనుమాన్ గ్రామ సమాఖ్యలోని 22 పొదుపు సంఘాలకు 2022–23 ఏడాదికి గాను రూ.1.22 కోట్లు రుణం ఇచ్చారు. రుణ వాయిదాలను గడిచిన మార్చి నుంచి బ్యాంకు ఖాతాల్లో జమకావడం లేదు. దీంతో అనుమానం వచ్చిన స్త్రీనిధి జిల్లా మేనేజర్ సంపత్, సెర్ప్ మేనేజర్ సంతోష్ ఈ ఏడాది జూన్ 13న పోకలగూడెంలో బహిరంగ విచారణ జరిపారు. గ్రామదీపిక సునీత వాయిదా కట్టాల్సిన సొమ్ము కాజేసినట్లు తేలింది. రెండు నెలల వ్యవధిలో ఆ మొత్తం తిరిగి చెల్లిస్తానని అప్పుడు చెప్పిన గ్రామదీపిక, ప్రస్తుతం తాను చెల్లించలేనని చేతులెత్తేయడం గమనార్హం.

గ్రామదీపికపై వేటు

నిధులు పక్కదారి పట్టించిన గ్రామదీపికను విధుల నుంచి తొలగించినట్లు, సీసీ సాయమ్మను సస్పెండ్ చేసినట్లు సెర్ప్ ఏపీఎం సంతోష్ తెలిపారు. ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

జ్వరంతో గిరిజన బాలిక మృతి

డెంగీనా.. వైరల్ జ్వరంతోనా.?



శాన్వి (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ఓ గిరిజన బాలిక జ్వరంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. మృతికి వైరల్ ఫీవర్‌నా లేక డెంగీ జ్వరమా.? అనేది నిర్ధారణ కావాల్సి ఉంది. మండలంలోని నందిపాడు గ్రామానికి చెందిన ఊకె చిన ముత్తేశ్వరరావు, శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె శాన్వి(10)కి గత నెల 30 నుంచి జ్వరం రాగా, ఈ నెల 2న వినాయకపురం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఆ రోజు విధుల్లో ఉన్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ బాలికకు ఆరోగ్య పరీక్షలతోపాటు, ఆర్‌డీటీ పరీక్ష చేయించగా మలేరియా, టైఫాయిడ్ జ్వరంగా నిర్ధారణ కాలేదు. దీంతో సాధారణ జ్వరంగా గుర్తించి, మందులు ఇచ్చి ఇంటికి పంపారు. ఇంటికి వెళ్లిన తర్వాత జ్వరం తగ్గకపోవడంతో బాలిక అమ్మమ్మ స్వగ్రామమైన ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రాచన్నగూడేనికి తీసుకెళ్లి, అక్కడే ఓ ప్రైవేటు వైద్యుడి వద్ద వైద్యం చేయించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడు జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి పంపించాడు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసి చికిత్స అందించే క్రమంలోనే పరిస్థితి విషమించి బాలిక మృతి చెందింది. బాలిక మృతికి డెంగీ జ్వరమే కారణమని ప్రైవేటు వైద్యులు చెప్పినట్లు సమాచారం. దీనిపై వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి రాందాస్ నాయక్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. బాలిక మృతిపై విచారణ చేపట్టామని తెలిపారు. పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తే మలేరియా, టైఫాయిడ్ నిర్ధారణ కాలేదని పేర్కొన్నారు. గ్రామీణ వైద్యుడి వద్దకు తీసుకెళ్తే మలేరియాకు వైద్యం చేసినట్లు గుర్తించామని, జంగారెడ్డిగూడెం ఆస్పత్రిలో డెంగీ నిర్ధారణకు ఎలీషా పరీక్ష చేయకుండా ఎన్‌ఎస్–1 పరీక్ష చేసి వైద్యం చేశారని వివరించారు. బాలిక మృతిపై శనివారం డీఎంహెచ్‌ఓకు నివేదిక అందిస్తామని తెలిపారు.

కబేళాకు తరలిస్తున్న పశువులు పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా మూగజీవాలను తరలిస్తున్న రెండు వాహనాలను శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. అదనపు ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం... స్థానిక రింగ్‌రోడ్ సెంటర్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా రెండు ఐషర్ వ్యాన్లలో 108 పశువులను గుర్తించారు. పశువులను తరలిస్తున్న నల్లగొండ జిల్లా దేవరపల్లికి చెందిన కొర్రా గోపాల్, రంగారెడ్డి సమీపంలోని బండవేమూరుకు చెందిన రమాకాంత్ మోహన్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఏపీలోని మన్యం జిల్లా పార్వతీపురం నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. వాహనాలను సీజ్ చేసి, మూగజీవాలను మధిర గోశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇద్దరు అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఇద్దరికి పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా కళాశాల విద్యా కమిషనర్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాల హిస్టరీ అధ్యాపకుడు డాక్టర్ కె.జాన్‌మిల్టన్‌కు భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి కల్పించగా.. రసాయన శాస్త్రం అధ్యాపకుడు డాక్టర్ పి.రమేశ్ సంగారెడ్డి జిల్లా జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి పొందిన ఇద్దరు సీనియర్ అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, వైస్ ప్రిన్సిపాళ్లు బి.వెంకటేశ్వరరెడ్డి, టి.జీవన్‌కుమార్, అధ్యాపకులు, లెక్చరర్ల సంఘం బాధ్యులు ఎస్.గోపి, రవికుమార్, మాధవరావు, కిరణ్‌కుమార్, విజయకుమార్, జర్పుల రమేశ్, బి.వెంకన్న తదితరులు అభినందించారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్



జాన్‌మిల్టన్

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.జాన్‌మిల్టన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు పదోన్నతి కల్పించి భద్రాచలంలో ప్రిన్సిపాల్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించగా కళాశాల అధ్యాపకులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్ అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు



అభ్యర్థులతో సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో జూనియర్ అసిస్టెంట్ (గ్రేడ్–2)లుగా ఎంపికైన వారికి జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య కొత్తగూడెంలో శుక్రవారం ప్రొవిజినల్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 177 పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్షల్లో అర్హత సాధించిన 135 మందికి ప్రొవిజినల్ నియామక పత్రాలు ఇచ్చామని, మిగిలిన వారికి కూడా ఎన్‌ఓసీ వస్తే పత్రాలు జారీ చేస్తామని చెప్పారు. సింగరేణి ఆస్పత్రిలో పరీక్షల అనంతరం ఖాళీల ఆధారంగా పోస్టింగ్ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు కోడూరి శ్రీనివాసరావు, వేణుగోపాల్‌రావు, ముకుంద సత్యనారాయణ, నాగేశ్వరరావు, కె.సంతోష్‌కుమార్, బి.సుశీల్‌కుమార్, కె.శివకుమార్, వరప్రసాద్, వెంకటరమణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

మావోయిస్టుల చెర నుంచి జవాన్ విడుదల

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు కిడ్నాప్ చేసిన జవాన్‌ను శుక్రవారం విడిచిపెట్టారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా ఎర్మనార్‌కు చెందిన శంకర్ కుడియం ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే బస్తర్ బెటాలియన్‌కు ఎంపిక కాగా బీజాపూర్‌లోని పోలీస్ లైన్‌లో నివాసముంటూ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన గతనెల 29న స్వగ్రామానికి వెళ్తున్న సందర్భంలో మావోయిస్టులు కిడ్నాప్ చేశారు. ఆయన ఆచూకీ లేకపోవడంతో కుటుంబం ఆందోళన చెందుతుండగా, తామే కిడ్నాప్ చేసినట్లు మావోయిస్టు పార్టీ గురువారం లేఖ విడుదల చేసింది. జవాన్ కిడ్నాప్‌పై పోలీసు ఉన్నతాధికారులు స్పందించడం లేదని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇంతలోనే జవాన్ శంకర్‌ను విడిపించేందుకు బీజాపూర్ జిల్లాకు చెందిన గిరిజన సంఘాల నాయకులు శుక్రవారం చర్చలు జరపగా, కొన్ని షరతులు విధించి జవాన్‌ను సాయంత్రం విడుదల చేయడంతో ఆయన కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు.

యువతి అదృశ్యం

ఇల్లెందు: యువతి అదృశ్యంపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ అప్పారావు కథనం ప్రకారం.. మండలంలోని కొల్లాపురం గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి కోరం నవనీత గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లి కుమారి కూలి పనులకు వెళ్లి ఇంటికి వచ్చే సరికి కుమార్తె ఇంట్లో లేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లేకపోవటంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామ శివారులో శుక్రవారం నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. గ్రామ శివారులో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో సుజ్ఞానపురం గ్రామానికి చెందిన భూక్యా బిక్షం బైక్‌పై 7 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బైక్ సీజ్ చేసి, అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐలు గణేష్, కేశవరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట–భద్రాచలం క్రాస్ రోడ్డు మధ్యలో మణుగూరు–కొత్తగూడెంపై ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. దంపతులు కుమార్తెతో కలిసి బైక్‌పై కొత్తగూడెం వైపు వెళ్తుండగా మణుగూరు వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలోని కాల్వొడ్డు సమీపాన గుర్తు తెలియని వ్యక్తి (35) మృతదేహాన్ని ఈనెల 3వ తేదీన గుర్తించారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. అయితే, ఇప్పటివరకు ఆయన సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో శుక్రవారం కేసు నమోదు చేశామని ఖమ్మం త్రీటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని సూచించారు.